Assembles Of The Living Elohim (1. Tim 3:15) India presents............ పర్ణశాలల పండుగకు ఆహ్వానము

Satyamunakai Poratam REGD. No. 67970 / 97

# సత్యమునకై పోరాటం

Regd. Monthly Newspaper 67970/97
**Postal Regd. No. H/APM/01/2011-2014**
Valid upto 12/2014
Posted on 30th of Every Month
**Annual Subscription Rs. 100/-**

To :

| Head Office: | Admin Office: | Branch Office: | Founded: |
|---|---|---|---|
| **AOTLE-India** | **AOTLE-India** | **AOTLE-India** | **AOTLE-India** |
| P.B.No. 28 | P.B.No. 49 | Lolla-533 237 | P.B.No. 1 |
| Jeedimetla-500 855 | Bhimavaram-534 201 | Atreyapuram Mdl | Malikipuram-533 253 |
| Hyderabad | W.G.Dt, A.P. | E.G.Dt, A.P. | E.G.Dt, A.P. |

VOLUME : 13 BUL-ELUL 5773 (AUG-SEPT 2012) PAGES:4 ISSUE 169

**హెచ్చరిక:- ఈ పత్రిక ఖండితముగా సత్యాన్వేషుల కొరకు మాత్రమే గాని క్రైస్తవ మతశాఖల వారి కొరకు కాదు**

# సహోదరులనబడిన వారిలోనే సాతానున్నాడు - జాగ్రత్త!

అనాది కాలము నుండీ సాతాను పరమతండ్రిని అబద్ధికుడిగా ఋజువు చేయాలని ప్రాయాసపడుతూనే ఉన్నాడు. అందుకే పరమతండ్రిపై **అనుమానములు** పుట్టిస్తూ వస్తున్నాడు. యుక్తి-కుయుక్తులు సాతానుగాడి లక్షణములు. వాస్తవానికి నిజమనేది వాడికి తెలియదు. నిజాన్ని మన ద్వారానే రాబట్టి దానిని అనుమానింపజేయడమే సాతానుడి పని. అదే అవ్వ విషయంలో చేసాడు సాతాను. (ఆది 3:1-7)
పరమతండ్రి ఏమని చెప్పాడో తెల్సుకున్నాడు. చెప్పినదానిమీదే అనుమానాన్ని పుట్టించాడు. అంతేకాకుండా వాళ్లని నాశనం చేయడానికి ఆశలు ఎరచూపించాడు. అంతే ఆదిమానవులు పతనమయ్యారు. సాతాను **ఆలోచనల ద్వారానే** మనిషిని పతనానికి నడిపిస్తాడు.

**అనుమానం పుట్టించడం దయ్యపు లక్షణం**
**అబద్దాని నమ్మింపజేయడం దయ్యపు లక్షణం**
**అబద్దాలను ప్రచురపరచడం దయ్యపు లక్షణం**
**ఆశలు చూపి వంచించడం దయ్యపు లక్షణం**

అందువలననే అనేకులు నాస్తికులు అయ్యారు. అందువలననే అనేకులకు పరమతండ్రి మాటపై నమ్మకం కుదరడం లేదు. అందువలననే అనేకులు నాశనమైపోతున్నారు. పరమతండ్రికి వ్యతిరేకంగా మాట్లాడటమే సాతానుపని. సాతానుగాడి మాటలు వినినవారిలో యదార్థత ఉండదు, నిజాయితీ ఉండదు, తప్పు ఒప్పుకునే గుణం ఉండదు. పైగా ఇతరులపై తప్పును నెట్టివేస్తారు. ముఖాముఖిగా రాని ఆదాము అవ్వలను చూడండి. సాతానుగాడి మాటలు విని మోసపోయిన వారెవరూ ముఖాముఖిగా రారు. దాగుడుమూతలు మొదలు పెడతారు. తప్పును ఒప్పుకొనక ఎదుటివారిపై మోపుతూ ఉంటారు(ఆది 3:8-13). ఆదాము అవ్వమీదికి త్రోసాడు, అవ్వ సాతానుమీదికి త్రోసింది. కాని వాళ్ల పొరపాట్లు వాళ్లు గుర్తించలేదు. సాతాను జ్ఞానం అలాంటిది. సాతాను ఆత్మ ఉన్నవారికి పరమతండ్రి ప్రత్యక్షతలు తెలియవు. పరమతండ్రి కోరుకునే విధానం గ్రహించరు. ప్రార్థనలు-అర్పణలు అర్పిస్తారు గాని అవి పరమతండ్రి అంగీకరించడు(ఆది 4:4,5).

కోపగించుకోవడం, ముఖం చిన్నబుచ్చుకోవడం ఇవి సాతాను లక్షణాలు. చిన్నపిల్లల దగ్గర నుండి పెద్దవారి వరకు ఈ లక్షణాలు కన్పిస్తాయి. సత్క్రియలు చేయరు గాని తెలియకుండానే చాలా దుష్క్రియలు చేస్తుంటారు(ఆది 4:5-8).

రివర్స్ సమాధానం చెప్పడం, అడిగిన దానికి సరియైన సమాధానం యివ్వకపోవడం సాతాను లక్షణం (ఆది 4:9-14) మంచివాళ్లెపుడూ మంచిగానే బ్రతుకుతూ పరమతండ్రిలో ఆనందిస్తూ ఉంటారు (ఆది 4:26) సాతానుగాళ్లు సాతాను సంతానం సకల యుక్తి-కుయుక్తులతో, నటన భక్తితో పరమతండ్రికి హేయులుగా జీవిస్తూ పాతాళానికి పోతూ ఉంటారు. చక్కగా ఉండే వాటిని కళ్లతో ఆస్వాదిస్తూ మనస్సుకు వచ్చిన పనులు చేసుకుంటూ తిరుగుతారు సాతాను సంబంధులు(ఆది 6:1,2). వాదించడానికి, అక్రమమైన పనులు చేయడానికి సాతాను సంబంధులు పూనుకుంటారు. అవి పరమతండ్రికి ఇష్టం కావు(ఆది 6:3). అందువలనే మానవుడు ఆయుష్షును పోగొట్టుకుని తొందరగా (తమ కాలములకు ముందే) చనిపోతూ ఉంటారు. పనికిమాలిన సంతానం వలన పరమతండ్రికి చెడుపేరే తప్ప మంచి పేరు రాదు(ఆది 6:4). చెడుతనము, హృదయములలో తలంపులలోని ఊహలన్నీ కేవలం చెడ్డవిగా ఉంటాయి(ఆది 6:5). అందుకే పరమతండ్రి మనుష్యులయందు ఆనందించడంలేదు. తన భక్తులు మాత్రం ఆయన దృష్టిలో ఆయన కృపను పొందుతూనే ఉన్నారు(ఆది 6:8).

అనాదికాలంగా పరమతండ్రి బిడ్డలు, సాతాను బిడ్డలు పరమతండ్రిని ఆరాధిస్తూనే ఉన్నారు. గోధుమలు (హేబెలు సంతానం) గురుగులు (కయీను సంతానం) ఒకే పొలంలో మొలుస్తూ ఒకదానికి ఒకటి వ్యతిరేకంగా పనిచేస్తూ ఏక ఎలోహీంనే ఆరాధిస్తూ ఉన్నారు. అయితే పరమతండ్రి హేబెలు అర్పణను అంగీకరించాడు గాని కయీను అర్పణను అంగీకరించలేదు. కయీను సాతానుకి అర్పణ అర్పించలేదు. పరమతండ్రికే అర్పించాడు. కాని పరమతండ్రి మనస్సునుగాని, పరమతండ్రి విధానమును గాని ఎరిగిన వ్యక్తి కాదు. పరమతండ్రికున్న గుణలక్షణములు నీకు/మీకు లేకపోతే పరమతండ్రిని మీరు ఎరుగనట్లే లెక్క. పరమతండ్రిని ఎరిగినవారు ఎవరైనా ఈ లోకానికి ఛాలెంజ్‌గా బ్రతుకుతారు. ధైర్యంగా జీవిస్తారు. తప్పుడు భక్తి చేసేవారు ఏనాటికైనా తొట్రిల్లక మానరు(యిర్మీయా 6:15).

సాతానుకి పొలములేదు గనుక వాడు పరమతండ్రి పొలములోనే తన గురుగులను విత్తుతున్నాడు (మత్తయి 13:25-30) మంచి పొలములో చెడు విత్తనములు విత్తే దుష్టుడే సాతాను. సాతానుతో పోరాటం జీవితాంతం వరకూ తప్పదు. "మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసమును కాపాడుకొంటిని" అని అంటున్నాడు సౌలుగారు(2తిమోతి 4:7).
- ఇరుకు ద్వారమున ప్రవేశింప పోరాడుడి అని వాక్యం చెప్తుంది. ఆత్మీయ జీవితం అంటే సాతాను పోరాటం. ఎప్పటివరకూ అంటే మన జీవితం అంతం అయ్యేవరకూ తప్పదు (హెబ్రీ 10:33) శ్రమలతో కూడిన గొప్ప పోరాటము గూర్చి చెపుతుంది.

- పరమతండ్రికి-సాతానుకి పోరాటం ఉంది
- హేబెలుకి కయీనుకి పోరాటం ఉంది
- ఇస్సాకుకి ఇష్మాయేలుకి పోరాటం ఉంది
- ఇశ్రాయేలుకి ఐగుప్తీయులకు పోరాటం ఉంది
- గొఱ్ఱెలకాపరికి-తోడేలుకి పోరాటం ఉంది
- విశ్వాసికీ-అవిశ్వాసికీ పోరాటం ఉంది

పోరాటం లేని ఆత్మీయ జీవితం ఎక్కడుంది? మన శరీరంలోనే మనకు పోరాటం ఉంది (రోమా 7:18-25) ఇంట్లో పోరాటం, బయట పోరాటం ప్రతీ విశ్వాసికీ ఉంది. భార్యతో భర్తకు పోరు (సామెతలు 19:13), భర్తతో భార్యకు పోరు, పిల్లలతో తలిదండ్రులకు పోరు, తలిదండ్రులతో పిల్లలకు పోరు లేదా? నీతికి-అవినీతికి పోరులేదా? మంచికీ-చెడుకీ పోరులేదా? మంచివాళ్లకూ-మోసగాళ్లకు పోరులేదా? ఖచ్చితంగా ఉంది.

నేను 1982 నుండి పోరాడుతూ వస్తున్నాను. చాలాసార్లు నేను అనుకున్నాను. ఇక పోరాటాలు మానేసి అందరితో ప్రేమగా, సమాధానంగా కలిసి-మెలిసి ఉండిపోవాలని అందరిలాగే నేను కూడా సంతోషంగా జీవితం గడిపేయాలని కలలు కన్నాను. కాని పరమతండ్రి నన్ను అలా వెళ్లనివ్వలేదు. ఎవరితోనూ రాజీపడనివ్వలేదు. మా నాన్నగారు చాలాసార్లు నన్ను చూసి చాలా బాధపడేవారు. నీవు ఎవరిమాట వినవు, ఆఖరికి నా మాట కూడా వినడంలేదు. తరచుగా నీ ఉద్యోగాలు (మతశాఖలలో పాస్టర్‌పని) పోగొట్టుకుంటున్నావు, బాధలకు గురి

# పర్ణశాలల పండుగకు ఆహ్వానం

పరమతండ్రియైన యావె మానవాళికి యిచ్చిన నియామక కాలములలో (లేవీ 23వ అధ్యాయము, యోబు 24:1) పర్ణశాలల పండుగ ఒకటి. మన రక్షకుడైన యషువ మెస్సీయ దీనిని ఆచరించాడు (యోహాను 7:2-37. ఆయన శిష్యులైన సౌలు మొ॥గువారు ఆచరించారు అ॥కార్య 18:21 (ఈ వాక్యం తెలుగు బైబిల్లో లేదు గాని ఇంగ్లీషు బైబిల్లో ఉంది)

**[But bade them farewell, saying I must by all means keep this feast that cometh in Yahrushalem. But I will return again unto you, if YAHWEH will and sailed from Ephesus. Acts 18:21]**

ఇది ఎనిమిది దినముల పండుగ. ఈ సం॥రము ఇది సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 7వ తేదీ వరకు జరుగనైయున్నది.

1. **30-09-2012 మొదటి దినము ఏతనీమ్ 15 సంఖ్యా 29:12-16 (పండుగ విశ్రాంతిదినము)**
2. 01-10-2012 రెండవ దినము ఏతనీమ్ 16. సంఖ్యా 29:17-19
3. 02-10-2012 మూడవ దినము ఏతనీమ్ 17. సంఖ్యా 29:20-27
4. 03-10-2012 నాల్గవ దినము ఏతనీమ్ 18. సంఖ్యా 29:23-25
5. 04-10-2012 ఐదవ దినము ఏతనీమ్ 19 సంఖ్యా 29:26-28
6. 05-10-2012 ఆరవ దినము ఏతనీమ్ 20 సంఖ్యా 29:29-31
7. 06-10-2012 ఏడవ దినము ఏతనీమ్ 21 సంఖ్యా 29:32-34
8. **07-10-2012 ఏనిమిదవ దినము ఏతనీమ్ 22 సంఖ్యా 29:35-38(పండుగ విశ్రాంతిదినము)**

- లేవీ 23:28.........మొదటి దినము విశ్రాంతిదినము ఎనిమిదవ దినము విశ్రాంతిదినము
- లేవీ 23:41.........ఇది నిత్యనిబంధనతో కూడిన నియామక కాలము
- లేవీ 23:40.........పరమతండ్రియైన యావె ముందు సంతోషింపదగిన కాలము
- లేవీ 23:42.........రాబోయే జనాంగం తెల్సుకోవలసిన విధంగా....
- సంఖ్యా 29:35...... ఎనిమిదవ దినము యొక్క ప్రాముఖ్యత
- ద్వితీ 16:11+14...ఈ పండుగ అందరితోనూ ఆచరించవలసినది
- ద్వితీ 16:10.........పరమతండ్రియైన యావె దీవించినకొలది యివ్వవలసివుంది
- ద్వితీ 31:11.........ధర్మశాస్త్రము చదవవలసిన నియామకకాలము
- ద్వితీ 31:12.........ధర్మశాస్త్రము వినుటకు ప్రజలను ప్రోగుచేయవలసిన కాలము
- జెఫన్యా 3:18........పరమతండ్రి ప్రజలను ప్రోగుచేయుచున్నాడు
- నెహెమ్యా 8:17..... పర్ణశాలలు కట్టి అందులో నివసింపవలెను
- జెకర్యా 14:18,19..పర్ణశాలల పండుగకు రాకపోతే పరమతండ్రి ద్వారా శిక్ష తప్పదు
- యెషయా 29:1..... పండుగలను మర్చిపోవద్దని చెప్పబడినది
- కీర్తనలు 42:4....... ఉత్సహించి, ఆనందించి, ఆరాధించే కాలము
- నహూము 1:15.....పండుగను ఆచరించి మ్రొక్కుబడులు చెల్లించాలి
- యోహాను 7:2....... యషువ మెస్సీయ ఆచరించాడు, మనకు ఆయనే మాదిరి.

దూరము నుండి వచ్చు సహోదరులు సెప్టెంబరు 30వ తేదీ ఉదయముననే మలికిపురం రావలయును. అదే రోజు సాయంత్రం కారెక్టుగా 6 గం॥లకే ప్రార్దన ప్రారంభించబడును. షబ్బాతు ప్రార్దనలు, పండుగ నియామక కాల ప్రార్దనలు అన్నీ మలికిపురం మన సమాజ ఆవరణములోనే జరుగుచున్నవి గనుక మీరు అందరూ ముందుగా రావలసినదిగా తెలియపర్చుచున్నాము.

పరమతండ్రి చిత్తమైతే **"పరిశుద్దులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధ-1"** పుస్తకము అదే సమయంలో ఆవిష్కరించబడేలా అందరూ ప్రార్దించండి.

**అందరికీ షలోం.**

అవుతున్నావు. అనేకులకు శత్రువుగా ఉంటున్నావు. అనేకులను శత్రువులనుగా చేసుకుంటున్నావు అని బాధపడేవారు: ఒకరోజు ఆయనగూర్చి ప్రార్థనచేసి ఆయనకు చెప్పాను. అయ్యా! నేను ఎవరిమాట వినకపోవడం కాదు, ఒకాయన మాట వింటున్నాను. ఆయన మాట మనుష్యులకు చాలా వ్యతిరేకంగా ఉంది. అందువలననే నేను ఈ బాధలు అనుభవిస్తున్నాను. కాని పరమతండ్రిలో నాకు ఎంతో ఆనందం ఉంది అని చెప్పాను. చాలాకాలం (10సం॥రాలు) నేను-నా తండ్రి మాట్లాడుకోలేదు. కేవలం బైబిలు కోసం మాత్రమే సుమా!

అలా నా రక్తసంబంధులకు, బంధుమిత్రులకు నేను వేరైయ్యాను. నా మీద ఎవరూ నేరములు గాని నెపములు గాని మోపడానికి సరిపోరు. ఎందుకంటే నేను ఎవర్నీ మోసం చెయ్యలేదు. ఎవరివీ ఏమీ నేను ఆశించలేదు. నేనంటే ఇష్టపడనివారు నా వెనుక ఏమైనా అంటారేమో గాని నా ముందుకి వచ్చి నీవు ఇలాగని గాని, లేక అలా అనిగాని నేరం మోపడానికి సరిపోరు. క్రైస్తవ మతశాఖల్లో పనిచేసాను అక్కడ చూసాను మొత్తం మోసగాళ్లనందరినీ: బైబిలు కాలేజీలో చదువుతున్న రోజుల్లో (1982-1984) నేను చాలా కలలు కన్నాను గాని అవి అన్నీ వట్టివేనని ఋజువుచేసారు క్రైస్తవ మతశాఖ పాస్టర్లు, విశ్వాసులు: ఎక్కడో కోటికి-నూటికి ఎవరైనా ఉన్నారేమోగాని మెజారిటీ అంతా మోసమే. ఒకానొకనాడు బ్రతకలేక బడిపంతులు అన్నారు గాని ఇప్పుడు బ్రతకలేక గుడిపంతుళ్లు(పాస్టర్లు) అవ్వుతున్నారన్నది 100% నిజం. అందులో సందేహంలేదు.

- ప్రవక్తయైన యిర్మీయా జగడమాడువానివలె ఉన్నాడు. దేశస్తులందరితో కలహించువానివలె కనిపిస్తున్నాడు (యిర్మీయా 15:10) అయితే పరమతండ్రియొక్క మాట అతని జీవితం పట్ల వేరే విధంగా ఉంది 11వ వచనం. (నా జీవితం కూడా యిలాగే ఉంది)
- మోషేను చూడగానే ఐగుప్తీయులు ఏమనుకుంటున్నారో ఒకసారి చూస్తారా? నిర్గమ 10:7 చదవండి
- ప్రవక్తయైన ఆమోసును చూసి అమజ్యా ఏమంటున్నాడో అదీ ఒకసారి చూస్తారా? ఆమోసు 7:10-17, కుట్రదారుడిలా కనిపిస్తున్నాడట. పరమతండ్రిచేత వర్తమానం పట్టుకుని వచ్చిన ప్రవక్తను చూసి యాజకుడైన అమజ్యా అంటున్నమాట: యాజకుడికే ప్రవక్త తెలియకపోతే పనికిమాలిన విశ్వాసికి ఏమి తెలుస్తుంది??
- అపోస్తలుడైన సౌలును చూసిన వెంటనే ఆసియ నుండి వచ్చిన యూదులు చేసిన కలవరం చూడండి అ॥కార్య 21:27-30

దయ్యాలు గుర్తించాయి యషువ మెస్సీయను, అపోస్తలుడైన సౌలును (అ॥కార్య 16:16-18) కాని భక్తిపరులం అని చెప్పుకునేవారికి వీరు అర్ధం కాలేదంటే వీళ్లు దయ్యాలకన్నా ఎంత హీనమో! ఆలోచించండి. ఆఖరికి దయ్యపుజ్ఞానం, దయ్యపు వివేకం కూడా లేనివారు విశ్వాసులా? అంత హీనస్థితిలో విశ్వాసులు ఉండటం చాలా బాధకరంగా ఉంది.

ఒక మనిషి/విశ్వాసి మానసికంగా బలహీనంగా ఉన్నా లేక శారీరకంగా బలహీనంగా ఉన్నా సాతాను వాళ్లను చాలా తేలికగా వాడుకుంటాడు. చాలా తేలికగా వాళ్లను పడవేస్తాడు. భక్తిముసుగులో సాతాను చాలామంది విశ్వాసులను మోసం చేస్తున్నాడు. కాని విశ్వాసులకు వివేకము, జ్ఞానము లేక నశించిపోతున్నారు.

- అపోస్తలుడైన సౌలును, సీలను చూడగానే దయ్యము చెప్పిన సాక్ష్యం చూడండి (అ॥కార్య 16:16-18) అదే అపోస్తలుడైన సౌలును-సీలను చూడగానే భక్తిముసుగులో ఉన్న మోసగాళ్లు (విశ్వాసులు) చేసిన హడావుడి చదవండి (అ॥కార్య 13:44-50). 30 సం॥రాల ఆత్మీయ జీవిత అనుభవములో నేను చాలామంది భక్తిపరులం అనే విశ్వాసుల్ని, బోధకుల్ని చూసాను. ఎంత మంచి పేరున్న గొప్ప భక్తిపరులైనా, ఎంత మంచి గొప్ప బోధకులుగా ముద్రపడిన బోధకులైనా, అబద్దాలను, కొండెములను చాలా తేలికగా నమ్మడం చూసి నాకు చాలా బాధ అన్పించింది. "వివేకములేని వ్యక్తులు పంది ముక్కునున్న బంగారు కమ్మివంటి"వారని వాక్యం చెపుతుంది. అబద్దాలు నమ్మడం, వాటిని ప్రచారం చేయడంలో స్త్రీలు అగ్రగణ్యులు. అందుకే సాతానుడు స్త్రీలను చాలా చక్కగా వాడుకుంటున్నాడు. కనిపించరు గాని కుటుంబాలలో ఏలుబడి చేసేది ఆడవాళ్లే. వాళ్ల పంతం నెగ్గించుకోవడానికి స్త్రీలు మగవాళ్లను ఆడంగితనం గలవాళ్లుగా చేసేస్తారు. చాలామంది మగవాళ్లు ఆహాబులా (1రాజులు 21:25) henpecked husbands గా ఉన్నారు. ప్రతీదానికి భార్యమీద ఆధారపడడం, భార్య చెప్పినట్లే చేయడం, భార్య సలహాలేకుండా అడుగు ముందుకుపడదు. (అదే వాళ్ల స్వంత కార్యక్రమాలు కొన్ని ఉంటాయి అవే రహస్యపాపములు, అక్కడ మాత్రం భార్యకు తెలియకుండా చాలా బాగానే మేనేజ్ చేసుకుంటారు) ఎంత నమ్రత! ఎంత నమ్మకం! ఎంత విధేయత! అయ్యో! ఇందులో 10% పరమతండ్రికి చూపిస్తే ఎంత బాగుండును? భార్యని ఏలుమని బైబిలు చెప్తుంటే (ఆది 3:16) బానిసగా బ్రతికే నీవు/మీరు ఎలా పరమతండ్రి విశ్వాసులు అవుతారు? ఒక పెద్దమనిషి అంటాడు: అయ్యా! నా భార్య చాలా భక్తురాలండి మేము మా కుటుంబం అంతా ఆవిడ చెప్పినట్లే నడుస్తామండి. నాకు భక్తివిషయాలు ఏమీ తెలియదండి, మా ఆవిడను అడగండి. ఆవిడ ఎంత చెపితే అంతేనండి. మేమందరమూ అలాగే నడుచుకుంటామండి. చూసారా! ఎంత చక్కగా ఉందో? ఒకసారి 1కొరింథీ 14:34,35 ఏమి చెప్తుందో చూడండి. "భర్తల దగ్గర భార్యలు వాక్యం నేర్చుకోవాలని చెప్తుంది" కాని భర్తల పాత్ర భార్యలు తీసుకుంటున్నారు.

ఒక్కసారి ఆదికాండం 2:15-17 చదవండి. పరమతండ్రి ఈ మాట చెప్పింది ఆదాముతో: అందుకే నీవు, నీవు అని సంబోధిస్తూ ఆదాముతో మాట్లాడాడు. అప్పటికి మేడమ్‌గారు లేరు, ఒక్క ఆడామ్‌గారు మాత్రమే ఉన్నాడు. ఈ సంగతి బహుశా మేడమ్‌గార్కి ఆడామ్‌గారు చెప్పి ఉండొచ్చు? రహస్యమేమిటో ఎరుగని సాతాను ఆడామ్‌గారు లేని సమయంలో మేడమ్‌గారి దగ్గరకు వచ్చి ఎలా అడుగుతున్నాడో చూడండి ఆది 3:1-3.

సమస్య ఏమిటంటే, ప్రతీ మగవాడు సహజంగా స్త్రీని/భార్యను ఎక్కువగా ప్రేమిస్తాడు. ఎందుకంటే ఆమె అతని "యెముకలలో యెముక మాంసములో మాంసము" గనుక, "ఏకశరీరము" గనుక. ఎవరికీ చెప్పలేని రహస్యములన్నీ భార్యకే చెపుతాడు. అది మగవాడి బలహీనత. చెప్పిన రహస్యాన్ని గోప్యంగా ఉంచక వెల్లడి చేయడం స్త్రీ బలహీనత. జాగ్రత్తగా ఎంక్వయిరీలు చేసి రహస్యాలు సేకరించడం సాతానుగాడి బలహీనత: అందుకే ముగ్గురూ పరమతండ్రి ద్వారా శిక్షించబడ్డారు. తొందరగా నమ్మడం, మోసపోవడం అనేది స్త్రీ బలహీనత 1తిమోతి 2:13,14. అందుకే స్త్రీకి పురుషునిమీద అధికారం చేసే పని పరమతండ్రి యివ్వలేదు 1తిమోతి 2:12

- ప్రతీ విశ్వాసి లేక బోధకుని విషయంలో సాతానుడి పాత్ర లేకుండా ఉండదు. వాడు ఏదో విధంగా మనిషిని పడద్రోయాలని చూస్తూనే ఉంటాడు. ఏవేవో సమస్యలు తీసుకొచ్చి విశ్వాసభ్రష్ఠులను చేయాలని చూస్తాడు. వాడు ప్రతీసారి ఎక్కడో ఒకచోట ఉరులు ఒగ్గడం, వలలు పన్నడం, గాలం వేయడం మొ॥గు పనులు చేస్తూనే ఉంటాడు. వాడి పని కోసం ఎవరు పనికివస్తారో వాడు మనుష్యుల్ని/విశ్వాసుల్ని వెతుక్కుంటూ ఉంటాడు. వీడు చేసే పనులన్నీ చాలా రహస్యంగా ఉంటాయి. అనుమానమనేది రాకుండా చాలా జాగ్రత్తగా ఊసరవెల్లిలా రంగులు మారుస్తూ, నటిస్తూ, మాటల్లోకూడా చాలా చలాకీతనం ఉపయోగిస్తూ స్కెచ్‌లు గీస్తుంటాడు. అలా ఆదాముదగ్గర నుండి నేటివరకూ అనేక మంది భక్తుల జీవితాలతో ఆడుకుంటూనే వచ్చాడు. పరలోక రాజ్యసంబంధులందరూ వీడిని జయించారు, జయిస్తారుగాని నులివెచ్చని విశ్వాసులు, పరిశుద్ధాత్మ వివేచనలేని బోధకులు వీడి ద్వారా నాశనం అయ్యి, రక్షణను పోగొట్టుకుంటారు.
- పరమతండ్రి మనిషిని తయారుచేసింది తనకొరకు: యిర్మీయా 13:11. మగవాడ్ని తయారుచేసింది ఆడదాని కోసం కాదు. 1కొరింథీ 11:8,9.స్త్రీకి శిరస్సు పురుషుడైతే, పురుషునికి శిరస్సు యషువ మెస్సీయ. నరుడ్ని తయారుచేయడంలో పరమతండ్రియొక్క ముఖ్య ఉద్దేశ్యమే వేరు. నరుడు తన కొరకే జీవించాలి. అవసరమైతే తన కొరకే చనిపోవాలి. చాలామంది బుద్ధిహీనులైన మగవారు/పురుషులు పెళ్ళాంకోసం మరియు పిల్లలకోసం జీవిస్తూ, వారి ఏలుబడిని కోరుకుంటూ henpecked husbands గానూ chickenpecked fathers గానూ మారిపోయారు, మారిపోతున్నారు. ఇది చాలా బాధాకరం.

ఎవరైతే పరమతండ్రి కొరకు జీవించాలనుకుంటారో వారికి చాలా శోధనలు, యిబ్బందులు, ఇరుకులు ఎదురవుతూ ఉంటాయి. సాతానుడి యుద్ధం పరమతండ్రి బిడ్డలతోనే (ప్రకటన 12:17) సాతానుడి గురి సహోదరులమీద నేరములు మోపుకుంటూ తిరగడమే (ప్రకటన 12:10) సాతానుగాడి ఫిర్యాదులన్నీ ఆయన సేవకులపైనే జెకర్యా 3:1. సాతానుగాడి గురే ఆయనమీద, ఆయన బిడ్డలమీద: యోహాను 13:2,18,21,26,30. పరమతండ్రి సమాజమును నాశనము చేయడమే వాడి గురి: అ॥కార్య 20:29,30. తప్పుడు బోధలతో కలవరపరచడమే వాడి గురి అ॥కార్య 15:24. విశ్వాసుల మనస్సులు చెరపడమే వాడి గురి. అపోస్తలులకు వ్యతిరేకంగా బోధించడమే వాడి గురి (గలతీ 1:6-9) గొఱ్ఱెలను (విశ్వాసులను) దొంగిలించడమే వాడి గురి. యోహాను 10:1,8,10,12. గొఱ్ఱెలను త్రోవతప్పించడమే ఈ తోడేలుగాడి గురి. యిర్మీయా 50:6. గొఱ్ఱెలతో (విశ్వాసులతో) వ్యాపారం చేయడమే వీడి గురి యోహాను 2:13-17., గొఱ్ఱెలను (విశ్వాసులను) వధశాలకు తీసుకొనిపోవడమే వీడి గురి జెకర్యా 11:4-6. గొఱ్ఱెలను (విశ్వాసులను) చెదరగొట్టడమే వీడి గురి మత్తయి 26:31) అపోస్తలుల బోధను ఎదిరించు ఎలుమ వీడే అ॥కార్య 13:6-10. భక్తులమీదికి జనములను రెచ్చగొట్టువాడు వీడే అ॥కార్య 17:13. భక్తిపరులను సహితం మాయచేసి వాళ్ళద్వారా హింస కలుగజేయువాడు వీడే అ॥కార్య 13:50. సహోదరులమీద పగపుట్టించువాడు వీడే అ॥కార్య 14:2. అలనాడు యషువ మెస్సీయ పట్ల శాస్త్రులు, పరిసయ్యులు ధర్మశాస్త్రోపదేశకులు ఎలా నీచంగా ప్రవర్తించారో అలా ప్రేరేపించి నీచ కార్యములు చేయించువాడు వీడే: అపోస్తలుడైన సౌలు పట్ల నీచ యూదులు ప్రవర్తించిన రీతిగా సహోదరులను ప్రేరేపించి అల్లర్లు సృష్టించువాడు వీడే: వీడు పైకి సమాధానమునకు కర్తగా కనిపిస్తూ అల్లర్లు సృష్టించు అల్లరి కర్త వీడే అ॥కార్య 19:23

పరమతండ్రి యొక్క వధువు బలురక్కసి చెట్లమధ్యలో ఉంది. అది చాలా ఇరుకు మార్గము. ప్రవేశించడానికే పోరాడాలి. తీరా వెళ్లిన తర్వాత అక్కడ అనేక అడ్డుబండలు ఉన్నాయి. వాటన్నిటినీ ఛేదించుకుంటూ వెళ్లితేనే గాని అనుకున్న గమ్యం చేరలేము. అనేకమంది అభ్యంతరపడిపోయి ప్రేమలు చంపేసుకుని, విశ్వాసమును చెరుపుకుని భ్రష్టులైపోయే అవకాశాలు ఉన్నాయి. ఏర్పాటుచేయబడినవారు సహితము మోసపోయే రోజులు ఇవి. ఆఖరివరకు సహించినవారే రక్షించబడతారు అనేది నిజం.

గనుక ప్రియ సహోదరుడా! సహోదరీ! సహోదరులనబడిన వారిలోనుండి పనిచేసే సాతానుని గ్రహించుకోండి. బండమీద సర్పముల జాడ కనిపెట్టడం చాలా కష్టం. యషువ మెస్సీయ నామం ధరించినవారిలోనే చాలా దయ్యాలు, దయ్యపుబోధలు ఉన్నాయి. జాగ్రత్త. యషువ అంటే యావె రక్షకుడని; యెషువ అంటే ఏమిటి? యూదులందరూ యెషువ అంటున్నారు వాళ్ళు దిత్వ సిద్ధాంత సంబంధులు, నీవు ఏకత్వవాదివా? దిత్వవాదివా? అన్యజనులకు సున్నతి అవసరం లేదని అపోస్తలులు బోధించారు (చదువు అ॥కార్య 15వ అధ్యాయం) నీవు ఎందుకు సున్నతిపై మొగ్గుచూపుతున్నావు? ఎందుకు సున్నతి చేయించుకున్నావు? ఎందుకు ఇతరులకు చేయిస్తున్నావు? యూదులను సంతోషపరచాలనా? యూదుల సొమ్ములు ఆశించా? దేనికి? యూదుల చేత మంచి అనిపించుకోవాలని పిలాతు, పేస్తు మొ॥గు అధికారులు మెస్సీయను, సౌలును బంధకాలకు గురిచేసారు. నీది అదే ఆత్మకాదా? పరిశుద్ధ వస్త్రాలా? ముందు మనస్సును పరిశుద్ధంగా ఉంచుకో. వస్త్రాలు బాహ్య ప్రదర్శనేగాని అంతరంగ ప్రదర్శన కాదు గదా! బ్రతుకు మారిందా లేక బోధమారిందా? తప్పుడు బోధలలోకి పోయిన వారికి ఆత్మీయత ఏమి తెలుస్తుంది. ప్రేమ, స్నేహం అనే పదాలకు అర్థం తెలియనివారు సహోదరులా? అందుకే జాగ్రత్తగా ఉండుమని హెచ్చరిస్తున్నాను. ప్రియసహోదరుడా! సహోదరీ! జాగ్రత్త సాతాను సహోదరులనబడిన వారిలోనే ఉన్నాడు. జాగ్రత్త!!

-బ్రదర్. ఐజక్ ఇ. కుసుమ

## సహోదరులు పి.వై రత్నం గారికి అభిషేకము మరియు సన్మానము




దివి 5-9-2012 బుధవారం సహోదరులు **పి.వై.రత్నం** గార్ని (మెస్సీయ సమాజముల స్థాపకులు మరియు కాపరి) అభిషేకించుట, సన్మానించుట జరిగినది. ఈ సన్మాన సభకు ముఖ్యముగా రత్నంగారి యొక్క కుటుంబ సభ్యులు, కొత్తపూసలమూరి కాలనీ మెస్సీయ సమాజ సభ్యులైన సహోదరి రాహేలమ్మ, బ్రదర్ నాగరాజు, బ్రదర్ శ్రీరామమూర్తిగారు మరియు ఉర్లగొందితిప్ప, పాలకొల్లు, పూలపల్లి శివారు మెస్సీయ సమాజము కాపరి జి. జోసఫ్‌గారు, సమాజ సభ్యులైన రత్నంరాజు, కృపావరం, సత్తిబాబు మరియు కృత్తివెన్ను సమాజ సభ్యులైన సీమోను, సంతోషమ్మ మరియు ఇతరులు హాజరైనారు. పాస్టర్ జి. జోసఫ్ గారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమము బహు ఘనముగా జరిగినది. ఇతర ప్రాంతములనుండి కూడా అనేకమంది సభ్యులు ఈ కార్యక్రమములో పాలుపంచుకున్నారు.



# యాజకులు సైన్యములకు అధిపతియగు యావె దూతలు-3

**"యాజకులు సైన్యములకు అధిపతియైన యావె దూతలు!** గనుక జనులు వారి నోట ధర్మశాస్త్ర విధులను నేర్చుకుందురు. వారు జ్ఞానమునుబట్టి బోధింపవలెను." అని సైన్యములకు అధిపతియగు "యావె" మలాకీ ద్వారా సెలవిచ్చుచున్నాడు. యాజకుల యొక్క బాధ్యత ఏమిటో, వారు ప్రజలకు ఏమి బోధించాలో పరమతండ్రియైన యావె మోషే ద్వారా అహరోనుకు అతని సంతతివారికి సెలవివ్వడం జరిగింది. **మీరు ప్రతిష్ఠింపబడిన దానినుండి లౌకికమైన దానిని, అపవిత్రమైన దానినుండి పవిత్రమైనదానిని వేరుచేయుటకును, యావె మోషే చేత ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపించిన సమస్తవిధులను మీరు వారికి బోధించుటకును ఇది మీ తరతరములకు నిత్యమైన కట్టడ!** (లేవీ 10:11) ఈ విధముగా యాజకత్వం ఎంతో పవిత్రమైన బాధ్యతతో కూడిన విధానం. పరమతండ్రికి యాజకుడుగా ఉండాలంటే దానికి ఎంతో కార్యక్రమం జరగాలి. ఎక్కడ ఎటువంటి లోపం జరిగినా ప్రాణాలు కోల్పోవలసి వచ్చేది. యాజకుడుగా ప్రతిష్ఠింపబడాలంటే ఎన్ని కార్యక్రమాలు జరగాలో అహరోను విషయంలో మనకు తెలుస్తుంది. ఆ వివరాలు ఒకసారి పరిశీలిద్దాం...!

**అప్పుడు మోషే అహరోనును అతని కుమారులను దగ్గరకు తీసుకొని వచ్చి నీళ్లతో వారికి స్నానం చేయించెను. తరువాత అతడు అతనికి చొక్కాయిని తొడిగి అతనికి దట్టీని కట్టి నిలువుటంగీని, ఏఫోదును వేసి, ఏఫోదు యొక్క విచిత్రమైన నడికట్టును అతనికి కట్టి దాని వలన అతనికి ఏఫోదును బిగించి, ఆ పతకం వేసి ఆ పతకములో ఊరీము తుమ్మీము అను వాటిని ఉంచి అతని తలమీద పాగాను పెట్టి, ఆ పాగా మీదను అతని నొసట పరిశుద్ధ కిరీటముగా బంగారు రేకును కట్టెను. ఇట్లు యావె మోషేకు ఆజ్ఞాపించెను.** (మరిన్ని వివరాలకు లేవీయకాండము 8,9 అధ్యాయాలను చదవండి) ఇంతటి పవిత్రమైన కార్యక్రమాలెన్నో ఉన్నాయి. యాజకత్వం బాధ్యత ఎంతో పవిత్రతతో కూడినది. ఆయా బాధ్యతలు నెరవేర్చే క్రమంలో ఏమాత్రం క్రమం తప్పి మోషే ద్వారా "యావె" ఆజ్ఞాపించిన విధంగా కాకుండా వేరే విధంగా చేస్తే వారికి మరణమే గతి. విధి నిర్వహణలో ఎటువంటి రాగద్వేషాలకు, భావోద్వేగాలకు తావు ఉండరాదు. అహరోను కుమారులైన నాదాబు, అబీహులు తమ తమ ధూపార్తులను తీసికొని వాటిలో నిప్పులుంచి వాటిమీద ధూపద్రవ్యము వేసి, యావె తమకాజ్ఞాపింపని వేరొక అగ్నిని ఆయన సన్నిధికి తేగా యావె సన్నిధినుండి అగ్ని బయలుదేరి వారిని కాల్చివేసెను; వారు యావె సన్నిధిని మృతిబొందిరి. కొడుకుల మృతదేహాలను చూసి అందరి తండ్రులలాగే భోరున ఏడవడానికి అహరోనుకు ఛాన్సులేక కేవలం మౌనంగా చూస్తూ ఉండిపోయాడు. ఎందుకంటే "యావె"కు యాజకత్వం చేయడానికి ప్రతిష్ఠింపబడిన వ్యక్తి లౌకిక ప్రపంచంలోని వ్యక్తులవలె కాక ఎంతో పవిత్రతతో, బాధ్యతతో వ్యవహరించాలి. అంతేగాకుండా సమాజంలో జరిగే నేరాలను విచారణచేసి వారికి శిక్ష విధించడం వాటిని అమలు జరిపే విధానం కూడా యాజకునిపై ఉండేది. యాజకునికి ఏ విషయంలోనైనా సందేహం కలిగినప్పుడు అతడు పరమతండ్రికి మొఱ్ఱపెట్టేవాడు. అప్పుడు పరమతండ్రి ఊరీము, తుమ్మీముల ద్వారా తనయొక్క నిర్ణయాన్ని యాజకునికి తెలియజేసేవాడు. యాజకుని మెడలో ఉన్న పతకంపై ఇశ్రాయేలీయుల గోత్రాలను సంఖ్యను సూచించే పన్నెండు రాళ్ళు ఉండేవి. యాజకుడు తీసుకోవలసిన నిర్ణయాలను ఆ పన్నెండు రాళ్లను ప్రకాశింపజేయడం ద్వారా పరమతండ్రియైన యావె తెలియజేసేవాడు. ఆ విధంగా ఎలోహీమైన యావెనకు ప్రజలకు మధ్య మధ్యవర్తిగా యాజకులు వ్యవహరించేవారు. ఇక పాపపరిహారం నిమిత్తం బలులు అర్పించడం, ప్రజలు తీసుకుని వచ్చే అర్పణలు, ప్రత్యేక అర్పణలు అర్పించడం, మోషే ద్వారా పరమతండ్రి తెలియజేసిన నియామక కాలములలో వాటి వాటి క్రమము చొప్పున ఆ పండుగలను జరిగించడం, విశ్రాంతి, నెలారంభ దినములయందు యావె ఆలయంలో ఆరాధన చేయడం వంటి ఎన్నో ముఖ్యమైన పనులు నిర్వహించేవారు. యాజకుని సహాయకులుగా లేవీయులు ఉండేవారు. సర్వాధికారియైన "యావె" మందిరమునందు ఆవరణం, పరిశుద్ధస్థలం, అతిపరిశుద్ధస్థలం అను మూడు రకాల ప్రదేశాలు ఉండేవి. అతి పరిశుద్ధ స్థలంలో ప్రవేశించడానికి అర్హత ఉన్న ఏకైక వ్యక్తి ప్రధానయాజకుడు మాత్రమే. ఇశ్రాయేలీయులు కనానులో ప్రవేశించిన తరువాత ఆ భూభాగాన్ని లేవీ గోత్రీకులు తప్ప అందరూ పంచుకున్నారు. లేవీ గోత్రీకులకు ప్రజలమధ్య పాలైనను, స్వాస్థ్యమైనను ఉండకూడదని యావె మోషే ద్వారా సెలవిచ్చాడు. నేనే వారికి స్వాస్థ్యముగా ఉంటానని, ప్రజలు మందిరానికి తీసుకొని వచ్చే దశమభాగములు, కానుకలు, అర్పణలు, ప్రత్యేక అర్పణలు అన్నియు కూడా యాజకులకే చెందుతాయని తెలియజేసాడు (సంఖ్యా 18:20). ఇంకా యాజకులు వారి బాధ్యతలు గురించి వివరముగా తెలుసుకొనుటకు లేవీయ, సంఖ్యాకాండాలను చదవండి. అహరోను మొదలుకొని, సమూయేలు, ఫీనేహాసు, సాదోకు మొదలగువారు యాజకులుగా ఉండి యాజకత్వానికే వన్నె తెచ్చారు. అదే విధంగా ఒక యాజకుడు ఏ విధంగా గొఱ్ఱెల/మేకల రక్తంతో ప్రజల పాపముల నిమిత్తం పరిహారం చేస్తాడో అదే విధంగా సర్వలోకం యొక్క పాపముల నిమిత్తం తన స్వరక్తమిచ్చి ఆ రక్తం ద్వారా వారి పాపములను కడిగివేసి యాజకులకే యాజకుడిగా మెల్కీసెదెక్ క్రమం చొప్పున నిరంతరం యాజకుడిగా ఉండి నిరంతరం స్తోత్రార్హుడై యున్నాడు పరమతండ్రియైన యషువ మెస్సీయ! ఆయనయొక్క ఘనమైన నామమునకే మహిమ, ప్రభావములు యుగయుగములవరకు కలుగును గాక! ఆమేన్.

ఎలోహీమైన "యావె" మోషే ద్వారా ఆజ్ఞాపించిన సమస్తమైన ఆజ్ఞలను, కట్టడలను ప్రజలకు తెలియజేసి వారిని నీతిమార్గంలో నడిపించడం యాజకుల బాధ్యత. ఇందుకై వారు యావె నియామక కాలములలో ఒకటైన పర్ణశాలల పండుగ ఎనిమిది రోజులు కూడా ధర్మశాస్త్ర గ్రంధాన్ని చదివి ప్రజలకు వినిపిస్తారు. వాటిని వివరిస్తారు. ప్రజలకు మేలు కలుగునట్లు దీవెన వచనాలు పలుకుతారు. వాక్యము ప్రకారం యాజకుని బాధ్యతలు ఈ విధంగా ఉంటే దానికి పూర్తి విరుద్ధంగా ప్రస్తుతం జరుగుతున్నది. ఇశ్రాయేలీయులందరూ పరమతండ్రి స్వాస్థ్యమైనా వారిలో లేవీ గోత్రీకులు తప్ప ఇంకెవ్వరూ యాజకత్వం చేయకూడదు అన్నది పరమతండ్రియైన యావె ఆజ్ఞ. కాని నేటికాలంలో ఎవరుబడితే వాళ్ళు నేను ఆయన సేవ చేసేస్తాను అని బయలుదేరుతున్నారు. దీనికి కారణం -వద్దనుకుంటే వచ్చిపడిపోయే డబ్బు, గౌరవ మర్యాదలు. పోనీ అలా వచ్చి ఊడబొడిచేది ఏమన్నా ఉందా అంటే అదీ లేదు. పైగా అంతా వాక్యవిరుద్ధమైన బోధ! ఒక పాస్టర్‌గారు ఒకసారి నాతో వాగ్వాదానికి దిగి మేము ఎంతో కష్టపడి ప్రజలను దేవుడు వైపునకు నడిపిస్తుంటే మీరు వచ్చి చెడగొడుతున్నారు అని గొడవ మొదలుపెట్టాడు. అప్పుడు నేను అయ్యా! మీరు ప్రజలకు బైబిల్‌లో ఉన్నదాని ఉన్నదున్నట్టుగా బోధిస్తే సమస్యలేదు. కాని మీరు అంతా వాక్యానికి వ్యతిరేకముగా బోధిస్తూ అదే సత్యమని భ్రాంతిలో ఉండిపోతున్నారు. దీనివల్ల మీకుగాని మీ బోధలవల్ల మారిన విశ్వాసులకు గాని ఏమి ప్రయోజనం ఉండదు. అయితే ప్రజలకందరికి పరమతండ్రిని గూర్చిన సర్వసత్యాన్ని తెలియజేయడానికి, పరమతండ్రి ద్వారా పిలువబడి అహర్నిశలు ఎంతో శ్రమపడి పత్రికల ద్వారా, ఇంటర్నెట్ ద్వారా, ఇంకా ఎంతో దూరం బైక్‌లపై, బస్‌లపై, రైళ్ళపై ప్రయాణించి ఎంతో సేవ చేయుచున్నాం. ఈ మార్గంలో ఎన్నో ఆటంకాలు ఎదురవుతున్నా చాలీ చాలని ఆదాయంతో జీవితాన్ని నెట్టుకొస్తూ మొక్కవోని దీక్షతో పరమతండ్రిపై విశ్వాసముంచి ఈ పరిచర్య కొనసాగించుచున్నాము. మా ఈ ప్రయాస అంతా మిమ్ములను, మీ బోధలను విమర్శించడానికి కాదుగాని, సాతానుయొక్క బంధకములనుండి విడిపించి నరక మార్గంలో ప్రయాణించుచున్న మిమ్ములను జీవమార్గంవైపు మళ్లించడానికే! అని చెప్పాను. అసలు బోధకులకు వారి ముఖ్య కర్తవ్యం ఏమిటో తెలియదు. ముఖ్య కర్తవ్యం ఏమిటంటే లోకంలో యషువ మెస్సీయ మాత్రమే నిజమైన రకక్షకుడని, సర్వసృష్టికర్త అని ప్రకటించాలి. యషువ మెస్సీయను నమ్మినవారికి "యషువ మెస్సీయ" నామంలో మాత్రమే బాప్తీస్మం ఇవ్వాలి. ఆ తర్వాత వారందరికీ పరమతండ్రి యొక్క ఆజ్ఞలు, కట్టడలు వివరించి వారిని నీతిమార్గంలో నడిపించాలి. ఇదీ అసలు జరుగవలసిన పని. కాని బోధకులు మాత్రం మెస్సీయగారు ధర్మశాస్త్రాన్ని మ్రానుకు మేకులతో కొట్టివేసాడు కాబట్టి మనం ఆజ్ఞలు, కట్టడలు పాటించనక్కరలేదని బోధిస్తున్నారు. ఇది మెస్సీయ, ఆది అపోస్తులుల బోధకు పూర్తి వ్యతిరేకమైన బోధ. ఇదంతా ఎందుకు జరుగుతుందంటే సాతాను కుట్ర కుతంత్రాలవల్ల పరమతండ్రి తన సేవనిమిత్తం ఏ విధంగా కొందరిని ఎన్నుకొని వారిని తన ఆత్మతో నడిపిస్తున్నాడో, అదే విధంగా సాతాను కూడా కొందరిని ఎన్నుకొని వారిని మోసపరచు ఆత్మతో అబద్ధాలను నిజాలుగా నమ్మింపజేసే ఆత్మతో, భ్రమపరచు ఆత్మతో నడిపిస్తున్నాడు. సాతాను పరమతండ్రి ఆధిపత్యాన్ని సహించలేడు. కాబట్టి పరమతండ్రి చెప్పిన దానికి పూర్తి వ్యతిరేఖముగా చెప్పడమే వాడు ధ్యేయంగా పెట్టుకున్నాడు. మరి వాడి సేవకులు కూడా అదే ధ్యేయంగా పెట్టుకుంటారు కదా! చక్కగా ఏదేనుతోటలో ఫలవృక్షములు తింటూ రోజు సాయంత్రం వేళ పరమతండ్రితో సంభాషించుచూ, ఏ చీకూచింతా లేకుండా కాలం గడుపుచున్న ఆదాము హవ్వలను పరమతండ్రి నుండి దూరం చేసాడు అపవాది అయిన సాతాను! ఎలోహీం అయిన యావె "చెయ్యవద్దు" అని ఖండితంగా ఆజ్ఞాపించిన దానిని మొదట హవ్వ చేత, ఆ తర్వాత ఆదాము చేత చేయించాడు. తద్వారా వీరిరువురూ శాపానికి గురయ్యి ఏదేను తోట నుండి బయటకు గెంటివేయబడడం మాత్రమే కాకుండా పరమతండ్రి యొక్క సహవాసానికీ దూరమయ్యారు! ఈనాడు చూస్తే మీరు నిత్యజీవం పొందాలంటే తప్పనిసరిగా ఆజ్ఞలను, కట్టడలను పాటించాలి అని పరమతండ్రి ప్రకటింపజేస్తుంటే, అబ్బే! విశ్వాసముంచితే చాలు ఆజ్ఞలు, కట్టడలు పాటించనక్కరలేదు, పైగా వాటిని మెస్సీయగారు మ్రానుమీద కొట్టివేసారు. అని సాతాను తన సేవకుల ద్వారా ప్రకటింపజేస్తున్నాడు. ప్రజలు వీరి మాటలు నమ్మి ఆయన ఆజ్ఞలను పాటించకపోవడంవల్ల నిత్యజీవం బదులు నిత్యనరకాగ్నికి గురవబోతున్నారు. కాబట్టి క్రైస్తవ విశ్వాసులు కళ్లు తెరచి వాస్తవాన్ని గమనించితే వారికి మేలు!

ఒకసారి ఒక క్రైస్తవ బోధకునికి నాకు మధ్య ఇదే అంశంపై చర్చ జరిగింది. నేను ఆయనకు ద్వితీయోపదేశకాండం 28,29,30 అధ్యాయాలలోని కొన్ని వచనాలను చదివించి కాబట్టి మనం నిత్యజీవం పొందాలంటే ఈ ఆజ్ఞలు, కట్టడలు పాటించాలి అని చెబితే చూడుబాబూ అది పాతనిబంధన, కొట్టివేయబడినది. ఇప్పుడు మనం క్రొత్తనిబంధన క్రింద ఉన్నాము. అని బదులిచ్చాడు. అప్పుడు నేను అయ్యా! పాతనిబంధన క్రొత్తనిబంధన అంటే ఏమిటి అని అడిగాను. ఆయన ఒక వెఱ్ఱి నవ్వు నవ్వి ఈ మాత్రం తెలియదా? అని అడిగాడు. ఈ మాత్రం కూడా తెలియకే మిమ్మల్ని అడుగుతున్నాను చెప్పండి అన్నాను. అప్పుడు ఆయన బైబిల్‌లో ఆదికాండం నకు ముందు పాతనిబంధన అని వ్రాయబడి ఉంది చూశావా, అదే విధంగా మత్తయి సువార్తకు ముందు క్రొత్తనిబంధన అని వ్రాయబడి ఉంది చూసావా, అంటే ఆదికాండం నుండి మలాకీ వరకు పాతనిబంధన అని, మత్తయి సువార్తనుండి ప్రకటన గ్రంథం వరకూ క్రొత్తనిబంధన అని అర్థం. ఇప్పుడు తెలిసిందా! అని అన్నాడు. అప్పుడు నేను అలాగని పరమతండ్రియైన యావె చెప్పాడా? లేక ఆయన ప్రవక్తలేమన్నా విడగొట్టారా? యషువ మెస్సీయ గాని, ఆది అపోస్తులులు గాని విభజించారా అని అడిగే సరికి నోరెళ్లబెట్టాడు. అప్పుడు నేను పాతనిబంధనేదో, క్రొత్తనిబంధనేదో వాక్యంలోనే మీకు చూపెడతాను చూడండి అని చెప్పి నిర్గమకాండం 24:6-8 వరకు చదివించి ఇక్కడ మోషే పరమతండ్రియైన యావె తనకు ఇచ్చిన ఆజ్ఞలను, కట్టడలతో కూడిన నిబంధన గ్రంథమును ఇశ్రాయేలీయులకు చదివి వినిపించగా వారు **యావె చెప్పినవన్నియు చేయుదమని ఏకశబ్దముతో ఉత్తరమిచ్చిరి.** అప్పుడు మోషే కోడెలను వధించి వాటి రక్తంలో సగం తీసుకొని బలిపీఠం మీద ప్రోక్షించెను. మోషే ఆ రక్తమును తీసుకొని ప్రజలమీద ప్రోక్షించి ఇదిగో ఈ **సంగతులన్నిటి విషయమై యావె మీతో చేసిన నిబంధన రక్తం ఇదే అని చెప్పెను.** అదే విధంగా యషువ మెస్సీయ పస్కా పండుగలో (నీసాను నెల 13వ తేదీ రాత్రి 14వ తేదీ ప్రారంభసమయం) ఒక గిన్నెలో ద్రాక్షారసం తీసుకొని-ఈ గిన్నె మీకొరకు చిందింపబడుచున్న నా రక్తము వలనైన క్రొత్త నిబంధన" అని చెప్పారు. ఎప్పుడైతే ఒకటి క్రొత్తనిబంధన అని పిలువబడినదో దానికి ముందు జరిగినది పాత నిబంధన అవుతుంది. ఒకనాడు గొఱ్ఱెల/మేకల రక్తంతో పాపప్రాయశిత్తం జరిగేది. మెస్సీయగారు వచ్చిన తర్వాత మ్రానులో ఆయన కార్చిన రక్తం వల్ల సర్వమానవాళికి పాపప్రాయశ్చిత్తం జరిగింది. ఆనాటినుండి ఇకముందు రాబోయే తరాలవరకు ఉండే మానవులందరి పాపపరిహారం గొఱ్ఱెల/మేకల రక్తం ద్వారా కాకుండా తన యొక్క రక్తం ద్వారానే జరుగుతుందని మెస్సీయ గారు ప్రకటించారు. ఇదీ సంగతి అని వివరించేసరికి మారు మాట్లాడక మౌనంగా వెళ్లిపోయారు ఆ పాస్టర్‌గారు! బోధకులైన వీళ్లు ఇంత అజ్ఞానంతో ఉంటే వీరిని వెంబడించే విశ్వాసులు ఇంకెంత అజ్ఞానంలో ఉంటారో కదా! **గ్రుడ్డివారు గ్రుడ్డివానికి త్రోవ చూపగలడా? వారిద్దరూ కలిసి గుంటలో పడతారు కదా!** అని మెస్సీయగారు చెప్పినది వీరి విషయంలో సరిగ్గా సరిపోయింది.

ఈ మధ్య ఒక స్నేహితునితో నెట్‌లో ఛాటింగ్ చేస్తూ బైబిల్ విషయాలపై చర్చిస్తూ ఉన్నప్పుడు ఆ స్నేహితుడు **ఎఫెసీ 2:14** వచనం పోస్ట్ చేసాడు. దాని ప్రకారం మెస్సీయగారు ధర్మశాస్త్రాన్ని మ్రానుకు మేకులతో కొట్టివేసారు కాబట్టి మనం ఇక ధర్మశాస్త్రాన్ని పాటించనక్కరలేదని రాశాడు. దాదాపు ప్రపంచక్రైస్తవులందరిదీ ఇదే అభిప్రాయం. కాబట్టి వీరు ఎక్కువగా మత్తయినుండి ప్రకటన గ్రంథం వరకూ ఉండే వాటికే విలువిస్తారు. దీనికి కారణం వీరికి సౌలుగారి లెటర్ వెనుక పరమార్థం అర్థం కాకపోవడం వల్లే! సౌలు మాటలు తమ స్వంత నాశనానికే అపార్థం చేసుకుంటారని అపోస్తలుడైన పేతురు ఆనాడే సెలవిచ్చారు. ధర్మశాస్త్రంనందు ఎంతో ఆసక్తి కలిగి అందులో ప్రావీణ్యత సంపాదించి తన జీవితకాలమంతయూ పరమతండ్రి యొక్క ఆజ్ఞలకు, కట్టడలకు విధేయుడై జీవించిన అపోస్తలుడైన సౌలు ధర్మశాస్త్రం కొట్టివేయబడింది అని ఎందుకు రాస్తాడు? అన్న ఇంగిత జ్ఞానం ఈ క్రైస్తవ బోధకులకు లేదు. దాదాపు 2000 సం॥రాలు గడుస్తున్నా ఏ సందర్భంలో సౌలు అలా రాశాడో ఆత్మీయ అంధకారంలో ఉన్న క్రైస్తవలోకానికి అర్థం కావడంలేదు. అసలు యషువ మెస్సీయ ఎవరు? ఆయన ఎందుకు మ్రానుపై మరణించాడు? అన్న విషయాలు చూస్తే ఆదిలో భూమ్యాకాశాలు సృజించబడక మునుపు ఆత్మరూపియై ఉన్న యావె తండ్రి తన యొక్క వాక్కు చేత సర్వసృష్టిని సృజించాడు. మన పితరులైన నోవాహు అబ్రాహాముతో ఆత్మరూపిగా ఉండి మాట్లాడాడు. అబ్రాహాముయొక్క విశ్వాసమునకు మెచ్చి అబ్రాహామును, అతని సంతతివారును, నిత్యము నాకు స్వాస్థముగా ఉంటారని సెలవిచ్చాడు. తన స్వాస్థ్యమైన ఇశ్రాయేలీయులను ఐగుప్తునుండి విడిపించి వారితో సీనాయి పర్వతం వద్ద ఆజ్ఞలు కట్టడలు మోషే ద్వారా అనుగ్రహించి ఒక నిబంధన చేసాడు. వారికి నిత్యము మేలు కలుగునట్లు ఆ ఆజ్ఞలు, కట్టడలు పాటించాలని, అట్లు పాటించకపోతే శాపానికి గురవుతారని వారికి తెలియజేయడం జరిగింది. కాని ఇశ్రాయేలీయులు ఎలోహీం అయిన "యావె"ను విసర్జించి ఆయన కట్టడలను మీరి, అన్యదేవతలను పూజించగా వారిని శత్రువుల చేతికి అప్పగించాడు ఎలోహీం అయిన యావె! ఇటు ఇశ్రాయేలీయులు కాని ప్రజల సంగతి చూస్తే వీరికి అసలు విశ్వాసమే లేదు. ఒక నిరీక్షణ లేదు. ఎవరికి బడితే వారు విగ్రహాలను చేసుకొని పూజిస్తూ తమకిష్టం వచ్చినట్లు విచ్చలవిడిగా జీవిస్తూ ఉన్నారు. ఈ విధంగా సర్వమానవాళి ఘోరపాపంలో ఉండిపోయింది. అంతకుముందు ఎంతమంది ప్రవక్తలను పంపుచూ వచ్చిన వారి పరిస్థితులలో మార్పులేదు. వీరందరిని వారి పాపములోనుండి విమోచించడానికి ఆత్మరూపియైన యావె శరీరం ధరించి నరునిగా భూమిమీద పుట్టాడు. తనయొక్క రక్తం ద్వారా సర్వమానవాళియొక్క పాపములను పరిహరించి అంతవరకు యూదులు, అన్యజనులుగా రెండు వర్గాలు ఉన్న ప్రజలను ఏకం చేసాడు. ఆనాడు ఆదిలో ఆదాము, హవ్వలు పోగొట్టుకున్న మహిమను తిరిగి ఇవ్వడానికి తనయందలి విశ్వాసమును వారు వదిలివేసిన ఆజ్ఞలను కట్టడలను పునరుద్ధరించడానికే ఆయన శరీరధారిగా వచ్చి మ్రానుమీద మరణించాడు. మేము మాత్రమే అబ్రాహాము సంతానం, సున్నతి గలవారం అని విఱ్ఱవీగే ఇశ్రాయేలీయులు, అన్యజనులంటే తీవ్ర ద్వేషభావంతో ఉండేవారు. ఆ ద్వేషం తరతరాలుగా ఒక గోడవలె ఉండిపోయింది. ఇప్పుడైతే మెస్సీయగారు మ్రానుపై మరణించడం ద్వారా ఆ గోడను బ్రద్దలు చేసి వారిద్దరిని (రెండు జనాంగాలను) ఐక్యం చేసారు. ఇప్పుడైతే యూదుడని లేదు, గ్రీసుదేశస్థుడని లేదు. ఎవరైతే యషువ మెస్సీయను లోక రక్షకునిగా అంగీకరిస్తారో వారే ఎలోహీం కుమారులనబడతారు. ఇదీ ఆ పత్రిక సారాంశం. అంతేగాని మోషే ద్వారా తాను ఇచ్చిన ఆజ్ఞలను, కట్టడలను కొట్టివేయడానికి పనిగట్టుకుని రాలేదు, అంతేగాక ధర్మశాస్త్రమందు నిష్ఠాగరిష్ఠుడైన సౌలును పిలిచి నీవు వెళ్లి ఆజ్ఞలు, కట్టడలు కొట్టివేయబడ్డాయని చెప్పు అని పంపలేదురా పిచ్చినాన్న! అని చెప్పేసరికి నోరుమూసుకున్నాడు. యషువ మెస్సీయ జీవించియున్న కాలంలో ఆయన ఎప్పుడు ధర్మశాస్త్రాన్ని పాటిస్తూ జీవించాడు గాని ధర్మశాస్త్రానికి వ్యతిరేకంగా చేస్తూ జీవించలేదు. యషువ మెస్సీయ ఆరోహణమయ్యే సమయంలో

శిష్యులను పిలిచి సమస్త ప్రజలను శిష్యులనుగా చేయుడి వారికి తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మయొక్క నామములో బాప్తీస్మము ఇవ్వండి అని ఆజ్ఞాపించాడుగాని, మేము ముగ్గురు దేవుళ్ళము. తండ్రి ఆకాశమందున్నాడు. నేను కుమారుడను, పరిశుద్ధాత్మ అని ఇంకొకరు ఉన్నారు అని ప్రకటించండి, మరియు మా తండ్రి ఇచ్చిన ఆజ్ఞలు, కట్టడలు నేను కొట్టివేసాను కాబట్టి వారు కేవలం నాయందు విశ్వాసముంచితే చాలని ప్రకటించండి అని ఎమైనా ఆజ్ఞాపించాడా? కన్నులుండి చూడలేని గ్రుడ్డివారైన ఇశ్రాయేలీయులు తామంతా వస్తాడని ఎదురు చూసిన మెస్సీయ తమ మధ్య జన్మించి, పెరిగి పెద్దవాడై తమకు సమస్తము బోధించిన మెస్సీయను చూడలేక దైవద్రోహి, మతద్రోహి అని నిందలువేసి సిలువ వేసి చంపారు. వారు సిలువవేసిన యెషువయే వారు ఎదురు చూస్తున్న మెస్సీయ అని బోధించడానికి, వారిని మెస్సీయవైపు త్రిప్పడానికి అన్యజనులలో యెషువ మెస్సీయ ప్రకటించడానికే మెస్సీయగారు అపోస్తలులను పంపించారు. వారు అదే ప్రకటించారు. అంతేగాని ధర్మశాస్త్రం కొట్టివేయబడింది అని, ఆజ్ఞలు, కట్టడలు పాటించనక్కరలేదని ఎక్కడా, ఎవరూ బోధించలేదు. అలా ఎవరైనా బోధిస్తే వారు ఖచ్చితంగా సాతాను సంబంధులే.!!

**- బ్రదర్ పి. రాజు**

# దుర్దినములు రాకముందే

సర్వశక్తునియందు నిలిచియున్న మీకు శుభము, సమాధానము కలుగునుగాక (షలోం)! నీతిమంతుడును నిత్యనివాసియునైన పరమతండ్రి కృప మీకును మీ కుటుంబమునకును తోడుగా ఉండును గాక. మరొకమారు మిమ్మును కలుసుకునే అవకాశమును అందించిన విధానమును బట్టి ఆయనకు ఎంతగానో కృతజ్ఞతాస్తుతులు చెల్లించుకొనుచున్నాము. ప్రేమా, సమాధానములకు కర్తయైన సృష్టికర్త కృప మనలను నిత్యము నడిపించును గాక!

ఆత్మీయులారా! మన మనస్సు, హృదయమును కలవరపెట్టు నేటి దినములే ఈ వ్యాసమును రచించుటకు గల కారణము. లోకమంతయు పాపముతో నిండియున్నది. కావున-

**"లోకమును దాని ఆశయు గతించిపోవుచున్నవి గాని, సర్వశక్తుని చిత్తమును జరిగించువారు నిరంతరము నిలుచును."** (1యోహాను 2:17)

మరియు - **"అయితే ఇప్పుడున్న ఆకాశమును భూమియు భక్తిహీనుల తీర్పును నాశనమును జరుగుదినము వరకు అగ్నికొరకు నిలువచేయబడినవై, అదే వాక్యమువలన, భద్రము చేయబడియున్నవి."** (2పేతురు 3:7)

లోక వినాశనము తథ్యమని సర్వశక్తుని వాక్యము మనలను హెచ్చరించుచున్నది కాదా? ఆనాడు సర్వాధికారియగు యెషువ చెప్పిన మాటలు నెరవేరుట చూచుచున్న మనమే ఆ మాటలకు సాక్షులము.

**"మీరు యుద్ధములను గూర్చియు యుద్ధ సమాచారములను గూర్చియు విననప్పుడు కలవరపడకుడి. ఇవి జరుగవలసియున్నవి గాని అంతము వెంటనే రాదు. జనము మీదికి జనమును రాజ్యము మీదికి రాజ్యమును లేచును, అక్కడక్కడ భూకంపములు కలుగును, కరువులు వచ్చును. ఇవే వేదనలకు ప్రారంభము."** (మార్కు 13:7,8)

- ఇప్పటికి రెండు ప్రపంచ యుద్ధములు సంభవించినవి
- అమెరికా మీదికి జపాన్, జపాన్ మీదికి అమెరికా, ఇండియా మీదికి పాకిస్థాన్, పాకిస్థాన్ మీదికి ఇండియా, ఇశ్రాయేల్ మీదికి పాలస్తీన, పాలస్తీన మీదికి ఇశ్రాయేల్, ఇరాక్ మీదికి అమెరికా, ఇలా జనము మీదికి జనము, రాజ్యము మీదికి రాజ్యము లేస్తూనే ఉన్నాయి.

సముద్ర గర్భములో, అట్టడుగున వున్న భూమి పొరల్లో ఏర్పడిన భూకంపముల వలన, సునామీలు భూమిని తుడిచిపెట్టుచున్నవి. ఎన్నో లక్షల ప్రాణములు హరించుచున్నవి. ఇలాంటివి మరెన్నో సంభవించుటకు సిద్ధముగా ఉన్నవి.

సోమాలియా లాంటి ఆఫ్రికా దేశాలలో కరువు కాటుకు ఎందరో మృత్యుఒడికి చేరుకుంటున్నారు. స్వచ్ఛమైన త్రాగునీరు అందక మన భారత దేశంలో ప్రతీ 8 నిమిషాలకు ఒక పసిమొగ్గ రాలిపోతున్నది. ఇవి గణాంకాలకు అందినవి మాత్రమే. మరి అందనివో?

**అవును వేదనలు ప్రారంభమైనవి**

మరియు-**"సైన్యములకధిపతియగు యావె దాని నియమించియున్నాడు. రద్దుపరచగలవాడెవడు? బాహువు చాచినవాడు ఆయనే దాని త్రిప్పగల వాడెవడు?** (యెషయా 14:27)

**"అందుచేతనే పాతాళము గొప్ప ఆశపెట్టుకొని అపరిమితముగా తన నోరు తెరచుచున్నది. వారిలో ఘనులును, సామాన్యులును ఘోషచేయువారును హర్షించువారును పడిపోవుదురు."** (యెషయా 5:14)

ఏలయనగా **"భూమియందంతట నాశనము ఖండితముగా నియమింపబడెను."**(యెషయా 28:22)

సర్వశక్తుని కోపము అగ్నివలె మండుచున్నది. ఎందుకనగా-

**"సైన్యములకధిపతియగు యావె యొక్క ధర్మశాస్త్రమును నిర్లక్ష్యపెట్టుదురు ఇశ్రాయేలుయొక్క పరిశుద్ధ సర్వశక్తుని వాక్యును తృణీకరించుదురు. కాబట్టి అగ్నిజ్వాల కొయ్యకాలును కాల్చివేయునట్లు, ఎండిన గడ్డి మంటలో భస్మమగునట్లు వారి వేరు కుళ్ళిపోవును. వారి పువ్వు ధూళి వలె పైకి ఎగిరిపోవును."**(యెషయా 5:24)

కావున **"సర్వలోకము పాడుచేయుటకై ఆయన దూరదేశమునుండి ఆకాశ దిగంతముల నుండి యావెయును ఆయన క్రోధము తీర్చు ఆయుధములును వచ్చుచున్నారు. యావె దినము వచ్చుచున్నది ఘోషించుడి అది ప్రళయమువలె సర్వశక్తుడగు తండ్రియొద్దనుండి వచ్చును. అందుచేత బాహువులన్నియు దుర్బలమగును. ప్రతివాని గుండె కరిగిపోవును. జనులు విభ్రాంతి నొందుదురు. వేదనలు దుఃఖములు వారికి కలుగును. ప్రసవవేదన పడుదానివలె వారు వేదన పడెదరు. ఒకరినొకరు తేరి చూతురు. వారి ముఖములు జ్వాలల వలె ఎఱ్ఱబారును. యావె దినము వచ్చుచున్నది. దేశమును పాడుచేయుటకును, పాపులను బొత్తిగా దానిలోనుండకుండ నశింపజేయుటకును క్రూరమైన ఉగ్రతతోను ప్రచండమైన కోపముతోను అది వచ్చును.** (యెషయా 13:5-9)

**"అయితే ఆయన వచ్చు దినమును ఎవరు సహింపగలరు? ఆయన అగుపడగా ఎవరు ఓర్వగలరు? ఆయన కంసాలి అగ్నివంటివాడు, చాకలివాని సబ్బువంటివాడు."**(మలాకీ 3:2)

ఇందును గూర్చి అపోస్తలుడైన పేతురు ఇలాగు చెప్పుచున్నాడు-

**"కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు సర్వాధికారి తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని ఎవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతము గలవాడైయున్నాడు"**(2పేతురు 3:9)

కావున యావె తన రాకడను ఆలస్యము చేయడు కాని, దీర్ఘశాంతము చూపుచున్నాడను మాట వాస్తవము ఏలయనగా-

**"యావె దయాదాక్షిణ్యపూర్ణుడు, దీర్ఘశాంతుడు, కృపాసమృద్ధిగలవాడు. ఆయన ఎల్లప్పుడు వ్యాజ్యెమాడువాడు కాడు. ఆయన నిత్యము కోపించువాడు కాడు."** (కీర్తన 103:8,9)

- నేడు మనము బ్రతికియున్నామంటే అది కేవలము సర్వశక్తిమంతుడైన యావె యొక్క కృప వలననే.
- మనము నివసించుచున్న ప్రపంచములో, దేశములో, రాష్ట్రములో, ప్రాంతములో, ఊరిలో, వీధిలో ఎన్నో దురదృష్టకరమైన సంఘటనలు జరుగుచున్నప్పటికిని వాటిలో మనము లేకపోవుటకు గల కారణము ఆయన హస్తము మనలను రక్షించుచున్నది.
- వ్యాధులతోను, వ్యసనములతోను, మందులకు లొంగని రోగములతోను, ఆకలితోను, కష్టముతోను, భయముతోను, బాధలతోను బ్రతుకుతున్న వారి మధ్యలో మనమూ బ్రతుకుచున్నప్పటికీ సర్వాధికారి మనకు తోడుగా ఉన్నది ఎందుకో తెలుసునా?

**"తండ్రి తన కుమారుల యెడల జాలిపడునట్లు యావె తనయందు భయభక్తులు గలవారి యెడల జాలిపడును. మనము నిర్మింపబడిన రీతి ఆయనకు తెలిసేయున్నది. మనము మంటివారమని ఆయన జ్ఞాపకము చేసికొనుచున్నాడు."** (కీర్తన 103:13,14)

మరియు-**"తన భక్తుల ప్రాణములను ఆయన కాపాడుచున్నాడు"** (కీర్తన 96:10)

కావున-**"ఆయన కృప నిరంతరము నిలుచునని యావెయందు భయభక్తులు గలవారు అందురు గాక!"** (కీర్తన 118:4)

మనము చూస్తున్న దినములు చెడ్డవైయున్నవి. మనుష్యులు కూడా చెడ్డవారైయున్నారని ఆయన వాక్యము చెప్పుచున్నది.

**"అంత్యదినములలో అపాయకరమైన కాలములు వచ్చునని తెలిసికొనుము. ఏలాగనగా మనుష్యులు స్వార్థప్రియులు, ధనాపేక్షులు, బింకములాడువారు, అహంకారులు, దూషకులు, తలిదండ్రులకు అవిధేయులు, కృతజ్ఞత లేనివారు, అపవిత్రులు, అనురాగరహితులు, అతిద్వేషులు, ద్రోహులు, మూర్ఖులు, గర్వాంధులు, సర్వశక్తుని కంటె సుఖానుభవము నెక్కువగా ప్రేమించువారు, పైకి భక్తిగలవారివలె ఉండియు దాని శక్తిని ఆశ్రయించనివారునై యుందురు."**

ధనాపేక్షను బట్టే నేటి సమాజములో (2తిమోతి 3:1-5) అనేక మోసములు, హత్యలు, దోపిడీలు, దొంగతనములు జరుగుచున్నవి.

పిల్లలు గల తలిదండ్రులు వృద్ధాప్యంలో అనాథలుగా విడువబడుచున్నారు. కొందరైతే తమ వృద్ధ తలిదండ్రులను శ్మశాన స్థలములో వదిలి వెళ్లేంత అనురాగ రహితులుగా మారిపోవుచున్నారు.

నక్సలిజం, తీవ్రవాదం ఇవన్నీ అతిద్వేషం వలన తలెత్తిన సమస్యలే.

జీర్ణించుకోలేని నిజం ఏమిటంటే అనేకులు సర్వశక్తుని పేరు చెప్పి భూసంబంధమైన వాటియందు అతిశయించుచున్నారు. పైకి భక్తిగలవారైనట్లు కనపడుచు అందినదల్లా దోచుకొనుచున్నారు కొందరు. గొఱ్ఱెపిల్ల బొచ్చును కప్పిన తోడేళ్లగా బ్రతుకుచున్నారు ఇంకొందరు. వీరివలె మనము ఉండకుండునట్లు ప్రయాసపడుదము.

**"మెట్టుకు సహోదరులారా, యే యోగ్యతయైనను, మెప్పైనను ఉండిన యెడల, ఏవి సత్యమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతిగలవో, వాటిమీద ధ్యానముంచుకొనుడి."**(ఫిలిప్పీ 4:8)

మరియు-**"నన్ను బలపరచువానియందే నేను సమస్తము చేయగలను."**(ఫిలిప్పీ 4:13)

అను దృఢమైన విశ్వాసము కలిగి సాగిపోదము రండి.

సర్వశక్తుని యందు భయభక్తులు కలిగినవారు ఆయన చిత్తమును నెరవేర్చువారై యుంటారు. కావున మనము ఆయన చిత్తమును జరిగింపవలసియున్నది. ఆయన చిత్తమును, ఆయన వాక్యమే తెలియజేయుచున్నది.

**"మీరు పరిశుద్ధులగుటయే, అనగా మీరు జారత్వమునకు దూరముగా ఉండుటయే సర్వశక్తుని చిత్తము. మీలో ప్రతివాడును సర్వశక్తుని ఎరుగని అన్యజనులవలె కామాభిలాషయందు కాక, పరిశుద్ధతయందును, ఘనతయందును తన తన ఘటమును ఎట్లు కాపాడుకొనవలెనో అది యెరిగియుండుటయే సర్వశక్తుని చిత్తము."**(1థెస్సలొనిక 4:3-6)

మరియు-**"ప్రతి విషయమునందును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి. ఈలాగు చేయుట యెషువ మెస్సీయ నందు మీ విషయములో సర్వశక్తుని చిత్తము."**(1థెస్సలొనిక 5:16-18)

ఇదియు గాక **"కుమారుని చూచి ఆయన యందు విశ్వాసముంచు ప్రతివాడును నిత్యజీవము పొందుటయే నా తండ్రి చిత్తము; అంత్యదినమున నేను వానిని లేపుదును."** (యోహాను 6:40) అని స్వయముగా సర్వాధికారియు, రక్షకుడగు యెషువ మెస్సీయ సెలవిచ్చెను కదా?

కావున సర్వశక్తుని చిత్తము నెరవేర్చువాడే ఆయన యందు భయభక్తులు కలిగినవాడు. అందుచేత-

**"క్షయమైన ఆహారముకొరకు కష్టపడకుడి గాని నిత్యజీవము కలుగజేయు అక్షయమైన ఆహారము కొరకే కష్టపడుడి"** (యోహాను 6:27) అని మెస్సీయ మనలను హెచ్చరించుచున్నాడు.

మరియు **"సర్వశక్తుడు పాపుల మనవి ఆలకింపబడి యెరుగుదుము; ఎవడైనను యావెభక్తుడై యుండి ఆయన చిత్తము చొప్పున జరిగించిన యెడల ఆయన వాని మనవి ఆలకించును."** (యోహాను 9:31)

అను మెస్సీయ మాట, సర్వశక్తుని చిత్తము నెరవేర్చువాని ప్రార్థన ఆయన సన్నిధికి చేరునని స్పష్టము చేసియున్నది.

- కావున మనము సర్వశక్తుని వాక్యమునందు నిలిచియుండుటే సత్యము
- శుద్ధహృదయము కలిగి జీవించుట మాన్యము
- మంచిని విత్తి, మేలు చేయుటే న్యాయము
- ఆయన ఆజ్ఞలను, కట్టడలను పాటించుటే పవిత్రము
- ప్రేమకలిగి జీవించుటే రమ్యము
- ఆయనను సేవించి, ఘనపరచుటయే ఖ్యాతి

వీటియందే మన ధ్యానమును నిలుపుకొందుము. ఏలయనగా రాబోవు విపత్కర పరిస్థితులను తప్పించుట కేవలము ఆయన వశమైయున్నది. కావున-

**"దుర్దినములు రాకముందే ఇప్పుడు వీటియందు నాకు సంతోషము లేదని నీవు చెప్పు సంవత్సరములు రాకముందే, తేజస్సునకును, సూర్యచంద్ర నక్షత్రములకును చీకటి కమ్మకముందే, వాన వెలిసిన తరువాత మేఘములు మరల రాకముందే, నీ బాల్యదినములయందే నీ సృష్టికర్తను స్మరణకు తెచ్చుకొనుము"** (ప్రసంగి 12:1-3) అని మొన్నటి ప్రసంగి హెచ్చరించుచున్నాడు. మరియు-

**"దినములు చెడ్డవి గనుక, మీరు సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుచు, అజ్ఞానులవలెకాక జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి."** (ఎఫెసీ 5:15,16) అని నిన్నటి అపోస్తలుడైన సౌలు హెచ్చరించుచున్నాడు.

మరి నేడున్న మనము ఏమి నిర్ణయించుకొనెదము? మనలని మనము ఏమని హెచ్చరించుకొందుము?

**-మీ ఆత్మీయ సహోదరి. దివ్య**

## ఎడిటర్ నోట్

ప్రియ పాఠకులకు షలోం. పత్రికను ఉచితముగా పొందుచున్నవారు తప్పక సం॥ర చందా రూ.100/- పంపి పత్రికను పొందవలెను. ఈ పరిచర్య ద్వారా బాప్తీస్మము పొంది సత్యములో నడచుచున్న సహోదరులు తప్పక పత్రిక పరిచర్యకై సహకరించవలెను. ఈ పత్రిక ప్రస్తుత కాలంలో కేవలం ఒక్క కుటుంబం ద్వారా మాత్రమే 2000 కాపీలు ప్రింట్ చేయబడుచున్నది. పుస్తకములు వ్రాయు సందర్భముగా మీ దశమభాగములను పంపించవలసి ఉన్నది. మన పరిచర్య ద్వారా బాప్తీస్మము పొంది సత్యములో నడుచుచూ దూరముగా ఉన్న సహోదరులు తమ కానుకలను ఆన్‌లైన్ ద్వారా పంపించవచ్చును. మన పరిచర్య కొరకై ప్రార్థించండి.

| | | |
|---|---|---|
| Isaac E. Kusuma | Isaac E. Kusuma | Isaac E. Kusuma |
| Online AcNo.30961655735 | Online AcNo.10025001028 | Online AcNo.62128006892 |
| Bank Code 12696 | Bank Code 0361 | Bank Code 21219 |
| State Bank of India | Andhra Bank | State Bank of Hyderabad |
| Malikipuram-533 253 | Malikipuram-533 253 | Malikipuram-533 253 |
| E.G.Dist | E.G.Dist | E.G.Dist |

Printed, Published and Owned by Isaac E. Kusuma and Printed at Ratna Offset, Malikipuram-533253. E.G.Dt. and Published at Malikipuram Editor Isaac E. Kusuma. All rights reserved